క్లుప్తంగా

మార్మోగిన గోవిందనామస్మరణ



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులు శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించి అనంతరం వెంకన్నస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. రఘు విద్యాసంస్థలు, ఎస్ఎస్ఆర్ఐఎఫ్ కళాశాల, ఛాయిస్, ఎవరెస్ట్, తిరుపతి ప్లైవుడ్స్, ఎంబీఏ కళాశాల, రాయల్ తండూరి, సప్తగిరి స్టోన్ క్రషర్స్, ఎల్ఎంఆర్ బ్రిక్ ఇండస్ట్రీస్, జొన్నాడ టోల్‌గేట్, గణేష్ కాంపౌండ్ వాల్స్, శ్రీకల్ప ఇండస్ట్రీ, కందుకూరి క్రికెట్ స్టేడియం, భూమాత లే అవుట్, సుకుమార్ షాప్స్, దాకమర్రి వైఎస్సార్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



సంతపేటలో ఫాగింగ్ చేస్తున్న శానిటేషన్ ఉద్యోగి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని 1, 2 వార్డులలో దోమల బెడద నివారణకు శనివారం పారిశుద్ధ్య సిబ్బంది రసాయనాల పిచికారీతో పాటు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీల నుంచి వెలువడుతున్న తోక పురుగుల సమస్యను సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు, కొందరు వ్యక్తులు చెత్తను ఇంటింటికి వచ్చే వాహనాలకు ఇవ్వకుండా నేరుగా డ్రైనేజీలలో పారవేయడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని వివరించారు. ముఖ్యంగా, మిగిలిపోయిన అన్నం వంటి ఆహార పదార్థాలను డ్రైనేజీలలో వేయడం వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెంది, దోమలు, తోక పురుగులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అరికట్టడానికి ప్రజల సహకారం అత్యవసరమని అధికారులు కోరారు.

పద్మనాభ స్వామి ఆలయానికి కంచు గంట వితరణ



ఆలయ అర్చకుడు ఆంజనేయస్వామికి కంచు వస్తువులు అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం గ్రామానికి చెందిన నల్లి శ్రీనివాస్, దేవి దంపతులు ఇక్కడ గిరిపై వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయానికి రూ.7,000 విలువ చేసే కంచు జే గంట, చేతి గంటలను వితరణగా అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు చేతుల మీదుగా ఈ గంటలను ఆలయ ప్రధాన అర్చకుడు పి. సీతారామాంజనేయ స్వామికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, భక్తబృందం సభ్యులు మొకర సన్నిబాబు, కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం, మజ్జివలస గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు తుపాకుల ఆదిలక్ష్మి, లచ్చుబుగత జగదీశ్వరరావులు శనివారం ఎంపీడీవో కేవీ నరసింహారావుకు ఫిర్యాదు చేశారు. ఈ నెల ఒకటో తేదీన స్పౌజ్ పెన్షన్లు పంపిణీ చేసే సమయంలో తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమను కాదని, కూటమి నాయకులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధంగా వ్యవహరించారని, దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వర్షాలు లేక రైతుల విలవిల

భీమిలిలో ఎండిపోతున్న ఆకుకూరలు, కూరగాయలు



వేమగొట్టిపాలెంలో నీరులేక వాడిపోతున్న పాలకూర



పాత సామియ్యవలసలో ఎండుతున్న వేరుశనగ పంట



వేమగొట్టిపాలెంలో వర్షాలు లేక భూమిలోనే ఉండిపోయిన ఆకుకూరలు



గిడిజాలలో బోరు పరిస్థితి ఇదీ..

తగరపువలస: ఆగస్టు నెల ప్రవేశించినా కనీస వర్షపాతం లేకపోవడంతో భీమిలి డివిజన్‌లోని ఆకుకూరలు, కూరగాయలు, పూలతోటలపై దాని ప్రభావం పడింది. దాదాపు చెరువులు, వర్షాలపై ఆధారపడి సాగు జరిగేచోట భూమిలో వేసిన విత్తనాలతో పాటు రైతులు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. మరోవైపు వేసవిని తలపిస్తున్న ఎండల కారణంగా చేతికి రావలసిన ఆకుకూరలు వాడిపోతున్నాయి. కూరగాయలు, పువ్వుల దిగుబడి తగ్గిపోయింది. చాలాచోట్ల వరినారును బతికించుకోవడానికి రైతులు బిందెలతో నీరు తెచ్చి జీవం పోసే ప్రయత్నం చేస్తున్నారు. బోరుబావులు సైతం అడుగంటిపోవడంతో ఈ పరిస్థితులలో వర్షం కురిస్తే తప్ప రైతులకు మరో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాలలో వరి, మొక్కజొన్న తరువాత ఎక్కువ మంది పండించేది పువ్వులు, ఆకుకూరలు, కూరగాయలే. ఆనందపురం, పద్మనాభం మండలాలలోని ప్రతి పంచాయతీలో కనీసం సగం మంది రైతులు ఈ పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా మద్ది, రేవిడి, కోరాడ, బోని, శిర్లపాలెం, కోలవానిపాలెం, తాళ్లవలస, పాండ్రంగి, మజ్జిపేట, ఆనందపురం, వేములవలస, బంటుపల్లి, కల్లాలు, బోయపాలెం, కాపులుప్పాడ, మజ్జివలస, తాటితూరు, ముచ్చర్ల, తంగుడిబిల్లి, వేమగొట్టిపాలెం, గిడిజాల, కణమాం, తర్లువాడ తదితర గ్రామాల రైతులు ఎక్కువ శాతం ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వీరికి సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా వీటిని సాగుచేస్తూ మార్కెటింగ్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం అనావృష్టి వాతావరణంలో వీరు సాగు చేసే ఆకుకూరలు, పువ్వులు, కూరగాయల సాగుపై దీని ప్రభావం పడింది. దీంతో పెట్టుబడులు పెట్టినా వరుణుడు కరుణించడం లేదు. మోటార్ల ద్వారా బోర్ల నుంచి నీటిని తీద్దామన్నా బొట్లుబొట్లుగా తప్ప నీరు రావడం లేదు.

చిన్న కమతాల రైతులకు పెద్ద నష్టం..

నియోజకవర్గంలో రైతులు తమకు గల భూమిని చిన్న కమతాలుగా విడగొట్టి మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి సాగు చేస్తారు. 30 నుంచి 45 రోజులలో దిగుబడి వచ్చే ఆకుకూరలతో ఈ గ్రామాలు నిత్యం ఆకుపచ్చగా ఉండేవి. కూరగాయలు 4 నుంచి 6 నెలల వరకు దిగుబడి ఇస్తాయి. ఒక పంట తీసిన తరువాత పంట మార్పిడి ద్వారా తరువాత ఆదాయం వచ్చే వాటిని ఎంపిక చేసుకుంటారు. ఇలా ఈ గ్రామాలలో నిత్యం ఆదాయం కురిపించే తెల్ల తోటకూర, గోంగూర, మెంతికూర, కొత్తిమీర, చిక్కుడు, కాకర, పొట్ల, వంకాయ, పాలకూర, దొండ, బెండ, వేరుశనగ, ఆనప, బీర, ఉల్లి పండిస్తుంటారు. మడులు, పంటలను బట్టి మార్కెట్‌కు వెళితే ఆ రోజు కనీస ఆదాయం రూ.1,000 నుంచి రూ.3,000 వరకు ఉండేది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా ఒకటో రెండో పంచాయతీలలో తప్ప చాలావరకు నీటి లభ్యత లేని కారణంగా రైతులు పంటలను కోల్పోనున్నారు.

బోర్ల నుంచి తక్కువ నీరు వస్తోంది



సాధారణంగా జూన్ చివరికి వర్షాలు పలకరించేవి. సీజన్ దాటి 45 రోజులు అయిపోతున్నా వర్షాల జాడ లేదు. అప్పుడప్పుడు పలకరిస్తున్న వర్షాలు ఒకచోట పడితే మరొక చోట ఉండటం లేదు. బోర్ల నుంచి చాలా తక్కువగా నీరు వస్తున్నందున పంట భూములలో ఎక్కువసేపు ఉండాల్సి వస్తుంది.
–కోరాడ అప్పారావు, వేమగొట్టిపాలెం

ఎండలు మండిపోతున్నాయి



ఒకవైపు వర్షాలు లేక మరోవైపు ఎండల కారణంగా ఆకుకూరల మడులకు తడి పెట్టినా కాసేపటికే ఎండిపోతున్నాయి. వడలిపోయిన ఆకు కూరలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండదు. వర్షం కురిస్తే తప్ప ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఇప్పటి నుంచి సంక్రాంతి వరకు ఆకుకూరలు, కూరగాయలు, పువ్వులకు డిమాండ్ ఉంటుంది.
–ఉత్తరాపల్లి బంగారి, గిడిజాల

నీటి కొరతతో ఇబ్బందులు



మండలంలో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మేము సాగు చేసే చోట బావులలో నీరు ఉంది. మా పక్కనే ఉన్న భీమిలి మండలంలో నీరు తక్కువగా ఉంది. అయినప్పటికీ ఎండల కారణంగా పంటలకు నీరు పెట్టినా ఎక్కువసేపు తడి ఉండటం లేదు. మళ్లీ మళ్లీ నీరు పెట్టవలసి వస్తుంది. –తాటిశెట్టి శ్రీను, పెద్దిపాలెం

మాట తప్పిన కూటమికి బుద్ధిచెప్పండి

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష నేతల భారీ ర్యాలీ



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వామ పక్ష పార్టీలు శ్రేణులు



ఈఈ సింహాచలం నాయుడుకి వినతి పత్రం ఇస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మధురవాడ: కూటమి ప్రభుత్వంపై వామపక్ష నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 'ఒడ్డుదాటే వరకు ఓడమల్లన్న–ఒడ్డు దాటాక బోడి మల్లయ్య' అనే సామెత చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని వామపక్ష నేతలు ఆరోపించారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మధురవాడలో భారీ ర్యాలీ, విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని ఏర్పాటు చేస్తుండడంపై నాయకులు ఎం. పైడిరాజు, డి. అప్పలరాజు, కె. దేవా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు మాట తప్పాయని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఎటువంటి నష్టం ఉండదని ప్రభుత్వం చెబుతున్న మాటలు మోసపూరితమైనవని, నష్టం లేకపోతే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాటిని ఎందుకు వ్యతిరేకించారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుమతిస్తే అది 'పులి నోట్లో తలపెట్టినట్టే' అని ప్రజలను హెచ్చరించారు. నగరంపాలెం రోడ్డు నుంచి మధురవాడ రోడ్ల మీదుగా ర్యాలీ సాగింది. విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా వామపక్ష నేతలంతా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఈఈ బి. సింహాచలం నాయుడుకు వినతి పత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగిస్తామని, ఆగస్టు 5న సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య, ఏఐడీఎఫ్, డీవైఎఫ్ఐ, వార్వా, నివాస్ తదితర ప్రజా సంఘాలకు చెందిన నాయకులు జేడీ నాయుడు, పి. రాజ్‌కుమార్ సత్యనారాయణ, ఆర్. బాబూరావు, బీఎస్ మూర్తి, శేషగిరిరావు ఎండీ బేగం, బి. భారతి, డి. కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, బేకరీల్లో విస్తృత తనిఖీలు



మిథిలాపూర్ వుడా కాలనీలోని బేకరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

మధురవాడ: మధురవాడ జీవీఎంసీ జోన్–2 పరిధిలోని మధురవాడ, మిథిలాపూర్ వుడా కాలనీ, కొమ్మాది జంక్షన్లలో ఉన్న బేకరీలు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల శాఖ అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని సంస్థలపై కేసులు నమోదు చేయడంతో పాటు, ప్రమాణాలు లేని కాటాలను స్వాధీనం చేసుకున్నారు. మిథిలాపూర్ వుడా కాలనీలో ఫుడ్ సేఫ్టీ అధికారి బి. నరసింహుడు, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ఇక్కడ ఉన్న హోం ఫుడ్స్ అండ్ ట్రీట్స్ బేకరీని ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. కాలం చెల్లిన తూనికల యంత్రాలను వాడుతున్నారని, ఇతర లోపాలు ఉన్నాయని నిర్ధారించి కేసు నమోదు చేశారు. కొమ్మాది జంక్షన్ ఏరియాలో నర్సీపట్నం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి. అనురాధ, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పలు హోటళ్లు, బేకరీలపై కేసులు నమోదు చేశారు.

తగరపువలసలో..

తగరపువలస: ఫుడ్ సేఫ్టీ జాయింట్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో లీగల్ మెటాలజీ అధికారులు శనివారం తగరపువలసలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా, ప్యాకేజీ లైసెన్సులు ఉన్నప్పటికీ, చాలా ఉత్పత్తులపై తయారీ తేదీ, తయారీ స్థలం, కంట్రోల్ నంబర్, బరువు వంటి కనీస వివరాలను నమోదు చేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, కొన్ని చోట్ల పరిమితికి మించి రంగులను వాడటంతో పాటు, నాసిరకం ముడి పదార్థాలను వినియోగిస్తున్నట్లు కనుగొన్నారు. మరో బేకరీకి చెందిన కార్ఖానాలో ప్యాకేజీ లైసెన్సు లేకపోవడం, తయారీ వస్తువుల వద్ద అపరిశుభ్ర వాతావరణం, పీడీఎఫ్ బియ్యం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దు



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ రవితో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

తగరపువలస: వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని జీవీఎంసీ 78వ కార్పొరేటర్ బి. గంగారావు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ బొట్టా రవిని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సర్దుబాటు చార్జీలను వ్యతిరేకిస్తూ శనివారం సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల అనుమతి లేకుండా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అదానీ సంస్థ సిబ్బంది స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతున్న ఈ చర్యలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. అదనపు లోడ్‌తో ఇప్పటికే నిలువుదోపిడీకి గురవుతున్న వినియోగదారులపై ఈ మీటర్ల ద్వారా దొడ్డిదారిన భారం మోపుతున్న కూటమి ప్రభుత్వం వెంటనే వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి, నాయకులు ఎస్. అప్పలనాయుడు, ఊళ్ల నాగరాజు, ముద్దాడ రాము, నీలాతి రాము, ఎస్. గున్న, పంపాన సూర్యనారాయణ, దామోదర బాబాజీ, పల్లా పెంటరాజు, నమ్మి నాయుడు, రీసు చిన్నారావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ చెక్కును అందజేస్తున్న మంత్రి వీరాంజనేయ స్వామి

పద్మనాభం: రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం మండలంలోని పాండ్రంగిలో అన్నదాత–పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో 14,981 మంది రైతులకు ఈ పథకం వర్తిస్తుందని, వారి ఖాతాల్లో రూ.10.28 కోట్లు జమ అవుతుందని తెలిపారు. పథకం చెక్కులను రైతులకు అందజేశారు. అదేవిధంగా, నాబార్డు నిధులు రూ.1.10 కోట్లతో పాండ్రంగి–సామయ్యవలస బీటీ రోడ్డు పునర్నిర్మాణానికి, జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏవో చలం పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళులు



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

భీమునిపట్నం: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ, మన దేశ గొప్పతనానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య మనకు గర్వకారణమని అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ పింగళి వెంకయ్యను స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తితో కూడిన మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డులోని గ్రీన్‌డేల్ స్కూల్ ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన ఇంటర్ స్కూల్స్ బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రంతో విజయవంతంగా ముగిశాయి. నగరంలోని 15 పాఠశాలల జట్లు ఉత్సాహంగా పాల్గొన్న ఈ పోటీలు క్రీడాస్ఫూర్తిని చాటాయి. శనివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య గ్రీన్‌డేల్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్ జట్లు ట్రోఫీ కోసం తలపడ్డాయి. ఇరు జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోరులో నేవీ చిల్డ్రన్ స్కూల్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నరప్ ట్రోఫీని గ్రీన్‌డేల్ స్కూల్ జట్టు దక్కించుకుంది.

ప్రిన్సిపాల్ దివ్యాదాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు ఐఐఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యతేజ ట్రోఫీలు, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, క్రీడాకారులు, స్కూల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, స్నేహభావాన్ని పెంపొందించాయని నిర్వాహకులు తెలిపారు.

బహుభాషా జర్నల్ ఆవిష్కరణ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రతిష్టాత్మకమైన బహుభాషా ఐఎస్ఎస్ఎన్ జర్నల్ ఆవిష్కరించారు. 'తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతల సాహితీ కృషి' అనే అంశంపై ద్వితీయ భాషా విభాగం అధ్యక్షులు, హిందీ ఆచార్యులు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ జర్నల్ రూపొందింది.

అవకతవకలకు పాల్పడితే రేషన్ డీలర్లపై చర్యలు

తగరపువలస: భీమిలి డివిజన్‌లో రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని సీఎస్‌డీటీ కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆనందపురం మండలం వేములవలసలోని 23వ నంబరు డిపోలో తనిఖీలు నిర్వహించారు. రేషన్ సక్రమంగా ఇవ్వని డీలర్‌పై తనకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.


సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శ్రీలక్ష్మి పూజలు శుక్రవారం 9వ రోజుకు చేరాయి. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సిరులతల్లికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

గంభీరం గెడ్డలో తాగునీటి పైపునకు లీకేజీలు



మురుగుతో నిండిన గెడ్డలో తాగునీటి పైపు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలోని బోయిపాలెం వద్ద ఉన్న గంభీరం గెడ్డలోని తాగునీటి పైప్ లైన్ లీక్ అవుతోంది. గంభీరం రిజర్వాయర్ నుంచి జీవీఎంసీకి నీటిని సరఫరా చేసే ఈ పైప్‌లైన్‌కు రెండు చోట్ల రంధ్రాలు పడటంతో ప్రతిరోజూ వేలాది లీటర్ల మంచినీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం ఈ గెడ్డలో పారిశుద్ధ్య వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి కంపు కొడుతోంది. వర్షాకాలంలో గెడ్డ నిండినప్పుడు, ఈ కలుషితమైన నీరు రంధ్రాల గుండా తాగునీటి పైప్‌లైన్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని జీవీఎంసీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రజలు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ రంధ్రాలను పూడ్చివేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. లేకపోతే తాగునీరు కలుషితమై ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు.



గెడ్డకు ఇవతలివైపు పైపుకు లీకేజీ



గెడ్డకు అవతలి వైపు పైపుకు లీకేజీ